క్లుప్తంగా

చెత్త కుప్పలో ఆధార్ కార్డులు



సర్పవరం పోస్టాఫీసు వద్ద పారిశుధ్య కార్మికులకు లభ్యమైన ఆధార్ కార్డులు

కాకినాడ రూరల్: తపాలా శాఖ ద్వారా ప్రజలకు చేరాల్సిన ఆధార్‌కార్డులు, విభూది, ప్రసాదం పొట్లాలు చెత్త కుండీలపాలయ్యాయి. యథావిధిగా చెత్త తొలగింపునకు వచ్చిన పారిశుధ్య కార్మికులు వాటిని చూసి ఆశ్చర్యపోయిన ఘటన సర్పవరం పోస్టాఫీసు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సర్పవరం గ్రామంలో పోస్టాఫీసు వద్ద పారిశుధ్య విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పోస్టాఫీసు వద్ద డస్ట్‌బిన్‌లో నుంచి చెత్త తొలగిస్తుండగా ఆధార్ కార్డులు, ప్రసాదం పొట్లాలు లభ్యమయ్యాయి. ఆధార్ కార్డులు, వాటిపై పేర్ల ఆధారంగా వారి చిరునామాలకు చేరాల్సి ఉంది. దీనిపై పోస్టల్ సిబ్బంది వివరణ ఇస్తూ ఇటీవల పోస్టాఫీసు కార్యాలయం ఇన్‌స్పెక్షన్ ఉండడంతో శుభ్రం చేశామని, పనిచేయనివిగా భావించినవి డస్ట్‌బిన్‌లో వేసి ఉండవచ్చని వారు చెప్తున్నారు.

కూరగాయల ధరలు అదుపులో ఉంచాలి

కాకినాడ సిటీ: పెరుగుతున్న కూరగాయల ధరలను అదుపులో ఉంచాలని సీపీఎం డిమాండ్ చేసింది. మంగళవారం రాత్రి సుందరయ్యభవన్‌లో దుంపల ప్రసాద్ అధ్యక్షత సీపీఎం నగర సర్వసభ్య సమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ పాల్గొని మాట్లాడారు. ఇటీవల పెరుగుతున్న కూరగాయల ధరలతో మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ధరల స్థిరీకరణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయలన్నారు. దళారీ వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన సీపీఎం నాయకులు సీహెచ్ సత్యనారాయణరాజు, తూర్పుగోదావరి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బి.లోవలోవ, పార్టీ అభిమాని సావిత్రమ్మలకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వనమాడి



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్ సగిలిని బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి కలెక్టర్‌కు పలు అంశాలను ఆయన వివరించారు.

గ్రంథాలయాలకు దాతల సహకారం అవసరం



మెటీరియల్ అందజేస్తున్న రాజేష్ ఖన్నా

పెద్దాపురం: గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని స్థానిక గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త జిగిని రాజేష్ ఖన్నా పోటీ పరీక్షలకు విద్యార్థులకు అవసరమ్యే గ్రూపు 2, రైల్వే, డీఎస్సీ, గ్రూప్ 1 పుస్తకాలను బుధవారం గ్రంథాలయాధికారి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. పాఠకుల సౌకర్యార్థం మెటీరియల్ అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుల్లియ్య, రామారావు, కొమ్మన అప్పారావు, అరవింద్, నరేంద్రకుమార్, వానపల్లి సత్యనారాయణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

30న హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: ఈ నెల 30వ తేదీ సాయంత్రం రెండు మున్సిపాలిటీల పరిధిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.ప్రభాకర్, జీవీకే మోహన్‌రావు, ఎ.శివయ్య, అల్లు ప్రసాద్, కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా శోభాయాత్ర నిర్వహించాల్సి ఉన్నదని, అప్పట్లో ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల వాయిదా వేశామన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట జంక్షన్, పాత తహసీల్దార్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు శోభాయాత్ర చేరుతుందన్నారు. అక్కడి నుంచి పెద్దాపురం పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు.

సార్వాకు సమాయత్తం

- కరప మండలంలో 14 వేల ఎకరాల్లో వరిసాగు
- నారుమళ్ల తయారీలో అన్నదాత నిమగ్నం



కరపలో సార్వాసాగు కోసం నారు పెంచడానికి విత్తనాలు చల్లుతున్న రైతు

కరప: వర్షాలు పడటం, పంట కాలువలకు నీరు వస్తుండటంతో రైతులు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఈనెల ఒకటో తేదీనే కాలువలకు నీరు వదిలినా మండలంలోని కాలువలకు నీరు రావడానికి పదిరోజులు ఆలస్యమైంది. నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యమవ్వడంతో ఎండలకు నారుమళ్లు దెబ్బతింటాయని రైతులు తొలకరి పనులు చేయడానికి ముందుకు రాలేదు. వారంరోజులుగా ఆకాశం మబ్బుపట్టి అడపాదడపా వర్షాలు పడుతుండటంతో నారుమళ్లు వేసుకోవడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. మండల పరిధిలో తొలకరిపంటకు సుమారుగా 14 వేల ఎకరాలు సాగుచేస్తుంటారు. సార్వాలో ముందస్తు సాగు చేపట్టాలని దానివల్ల పంట చివరిలో నవంబరులో వచ్చే తుపాన్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని, జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు వదిలారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, సాగునీరు సక్రమంగా రాక నారుమళ్లు పోసుకోవడానికి ఆలస్యమైందని రైతులు అంటున్నారు. మండలంలోని భూములన్నీ కాలువలకు శివారున, సముద్రతీరాన ఉంటాయి. మిగిలిన ప్రాంతాల వారితో పోలిస్తే వారం పదిరోజులు ఆలస్యమవుతుంది. అయితే కాలువలకు నీరు వచ్చిన ప్రాంతాల్లో నారుమళ్లు వేసుకోవడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా కొందరు రైతులు వెదజల్లు పద్ధతిని అనుసరించేందుకు అనువుగా ఉన్న పొలాలకు నీరుమళ్లించి దమ్ములు చేసుకుంటున్నారు. గతంలో ఎదురైన చేదు అనుభవాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని, సాగు మెళకువలు అనుసరించేందుకు ముందస్తు ఆలోచనలతో రైతులు నారుమళ్ల తయారీలో బిజీగా ఉన్నారు. శివారు ప్రాంత రైతులు, మెరక భూములలో నీరెక్కకపోవడంతో గుల్లలతో, ఇంజిన్లతో సాగునీరు తోడుకుని, నారుమళ్ల తయారీకి దమ్ముచేసి, చదును చేసుకోవడంలో తలమునకలై ఉన్నారు.



వాకాడ సమీపంలో నారుమడి తయారీకి ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



నారుమడికి చదును చేసుకుంటున్న రైతులు

నారుమళ్ల తయారీలో యాజమాన్య పద్ధతులు



నారుమళ్ల తయారీలో అనుసరించాల్సిన పద్ధతులపై ఎంఏఓ ఏవీ రాజేష్ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సరైన మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు.

– ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయాధికారి.

ఎండల వల్ల ఆలస్యం చేశాం



కాలువలకు ఈ నెల ఒకటో తేదీన నీరు వదిలినా, ఎండలు ఎక్కువగా కాస్తుండటంతో నారుమడి దెబ్బతింటుందని ఆలస్యంగా పనులు ప్రారంభించాం. గతవారం వాతావరణం అనుకూలించడంతో నారుమడి వేసుకున్నాం. మురగ దమ్ముచేయించేందుకు పనులు చేసుకుంటున్నాం.

– పెంకే అప్పన్న, కౌలురైతు, కరప

పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలి



'విద్యా ప్రవేశం'పై హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

కరప: గ్రామాల్లోని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, సీఆర్పీల సహకారంతో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషిచేయాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమై విద్యా ప్రవేశం గురించి, అవగాహన కల్పించారు. వచ్చేనెల 25వ తేదీ వరకు విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కలిపిస్తున్న వసతులు, అమలు చేస్తున్న పథకాలు తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 65 పాఠశాలల హెచ్‌ఎంల మొబైల్‌ఫోన్‌లలో విద్యాప్రవేశం యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, విద్యార్థుల నమోదును పెంచేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని వారు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతిర్మయి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

- డాక్టర్ సలాది జ్యోతిర్మయి
- ఎన్‌సీసీ విద్యార్థులతో అవగాహన ర్యాలీ

కాకినాడ రూరల్: మాదక ద్రవ్యాల దుర్వినియోగం పైనా, వాటి రవాణా పైన మూడో ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో మూడో ఆంధ్రా గరల్స్ బెటాలియన్ కాకినాడ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రముఖ డాక్టర్ సలాది జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులు, బ్యానర్లతో ఏపీఎస్పీ నుంచి సర్పవరం జంక్షన్ మీదగా బోట్‌క్లబ్ థర్డ్ గరల్స్ బెటాలియన్ వరకు థర్డ్ ఆంధ్రా, 9 ఆంధ్రా, 18 ఆంధ్రా ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ 18 ఆంధ్రా అధికారి మేజర్ ఆసిఫ్, థర్డ్ ఆంధ్రా బెటాలియన్ నుంచి సుబేదార్ లక్ష్మణరావు, పీఐ స్టాఫ్ పాల్గొని విజవంతంగా నిర్వహించారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

కాకినాడ క్రైం: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం నుంచి భానుగుడి కూడలి వరకు కొనసాగిన ఈ ర్యాలీని ఎస్పీ సతీష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో క్యామ్ ఇన్‌స్టిట్యూట్ సహా పలు విద్యా సంస్థల నుంచి విద్యార్థులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కఠిన చట్టాలు

కాకినాడ రూరల్: యువత జీవితాలను నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను రూపొందించాయని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదవ ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాధల నుంచి మైమరిపించే మాదవ ద్రవ్యాలను ఒక్క సారి వాడితే జీవిత కాలం దానికి బానిస కావడం జరుగుతుందని, పరువు, ప్రతిష్ట, డబ్బుతో పాటు చక్కటి ఆరోగ్యం కూడా నాశనం అవుతుందన్నారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం

కాకినాడ రూరల్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పుష్కర మాత కాన్వెంట్ కమిటీ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ సెంటర్ వారిచే స్థానిక ఏపీఎస్పీ వద్ద గల స్వామి కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుష్కర మాత ప్రాజెక్టు డైరెక్టర్ పి సుందర రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన వారు గంగరాజు నగర్‌లోని డిస్ట్రిక్ట్ డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌ను సంప్రదించి ఉచిత కౌన్సెలింగ్ సదుపాయాన్ని పొందాలని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ రూరల్, సర్పవరం పోలీస్ స్టేషన్ ఎస్సై అజయ్ బాబు మాట్లాడుతూ నేరం మారుతుంది కానీ మాసిపోదన్నారు. కాబట్టి జాగ్రత్తలు తీసుకుని డ్రగ్స్ రహిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణరావు, ఏడీ నారాయణరావు, కృష్ణ, కాకినాడ డీ అడిక్షన్ సెంటర్ ఇన్‌చార్జి సోంబాబు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే అతిసారకు మందు

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యం భద్రం
- డీఎంహెచ్ఓ నరసింహనాయక్



డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, కాకినాడ

కాకినాడ సిటీ: వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువ. ఈ వ్యాధి బారినపడిన వారు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు తాజా, వేడి ఆహార పదార్థాలను భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలను పాటిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహనాయక్ సూచించారు. ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇలా వివరించారు.

- ఈ వ్యాధి ప్రబలే కాలంలో క్లోరిన్ కలిపిన నీటిని విధిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే.
- కుండ లేక బిందెల్లో చేతులు ముంచి మంచి నీటిని తాగకూడదు. కాడ గిన్నెతో నీటిని గ్లాసులో పోసుకుని తాగడాన్ని అలవాటు చేసుకోవాలి.
- కలుషితమైన నీరు తాగకూడదు. మంచినీటి పైపులైన్ల పగుళ్లను విధిగా మరమ్మతు చేయించుకోవాలి.
- మంచినీటిని విధిగా క్లోరినేషన్ చేయాలి.
- పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం.
- చేతి పంపులు, కుళాయిల చుట్టూ పళ్లేల ఆకారంలో ప్లాట్ ఫారాలను నిర్మించుకోవాలి.
- నిల్వ ఉన్న మాంసాహారంతో పాటు ఎలాంటి పదార్థాలను అసలు తినకూడదు.
- ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి.
- భోజనానికి ముందు, మల విసర్జనకు తర్వాత విధిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ మల విసర్జన చేయకూడదు.
- ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడడాన్ని అలవాటు చేసుకోవాలి.
- మంచినీటి చెరువులో, మంచినీటి బావులు, బోర్ల వద్ద బట్టలు ఉతకడం, పశువులు కడగటం వంటివి చేయకూడదు.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- సూక్ష్మక్రిములు చేరకుండా పరిసరాల్లో చెత్త కుప్ప, పేడ నిల్వ ఉంచరాదు.
- వ్యక్తిగత, పరిశుభ్రత చాలా ముఖ్యం. వంట చేసే ముందు, భోజనం వడ్డించేందుకు ముందు కూడా సబ్బుతో గోళ్లతో సహా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- ఏ ప్రాంతంలో అయినా అతిసార ఉన్నట్లు అయితే ఆ ప్రాంత ప్రభుత్వాసుపత్రి వైద్యులకు సమాచారం అందించాలి.
- అప్పుడే వైద్యులు తక్షణం బాధితులకు వైద్య సేవలు అందించి రోగులకు కాపాడతారు.

లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి

యానాం: పట్టణంలో లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికశాఖ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ గతంలో అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన దయానిధి మార్చి 15న పుదుచ్చేరి బదిలీపై వెళ్లారని అనంతరం ఆయన స్థానంలో వేరొక అధికారిని నియమించలేదన్నారు. గత మూడు నెలలుగా కార్మికశాఖలో అసిస్టెంట్ లేబర్‌ఇన్‌స్పెక్టర్ నియామకం జరగక వేలాదిమంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్ఏఓ మునిస్వామి స్పందించి నూతన అధికారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ కుంచే సత్యనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో జాతరను విజయవంతం చేయండి

- ఆర్డీఓ జేఎస్ రామారావు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో మరిడమ్మ తల్లి జాతరను విజయవంతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక మరిడమ్మ తల్లి కాలక్షేప మండపంలో వచ్చే నెల నాలుగో తేదీ నుంచి జరగనున్న జాతర ఏర్పాట్లపై బుధవారం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, ఆర్టీసీ, మున్సిపల్, వైద్యశాఖాధికారులతో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వి రామ్మోహనరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే ఇలువేల్పుగా పేరొందిన అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అసవరమన్నారు. ఆయా శాఖల సిబ్బంది తమ తమ విధుల్లో నిమగ్నమై అమ్మవారి జాతర ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆషాఢ మాసంలో నిర్వహించే జాతరలో శానిటేషన్ పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ఆర్డీఓ సమీక్షించారు. ఈఓ రామ్మోహరావు మాట్లాడుతూ నాలుగో తేదీన జాగరణ ఉత్సవం తరువాత ఐదో తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు 37 రోజుల పాటు జాగరణ ఉత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఎస్ఐ వెలుగుల సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ బిడ్డల క్షేమమే లక్ష్యం

- ఎంసీపీ కార్డుతో ఎంతో మేలు
- పెద్దాపురంలో 1,387 మంది గర్భిణులు.. 1,552 మంది బాలింతలు



ఎంసీపీ కార్డు



ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జగదంబ

పెద్దాపురం: గర్భధారణ మొదలు ప్రసవం వరకూ మహిళ ఆరోగ్యంపై ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలు దరిచేరకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. దీని కోసం ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు నిర్వహిస్తున్నా మాతా శిశు మరణాలు ఆగడం లేదు. ప్రసూతి సమయంలోనూ గర్భిణులు అవగాహన లోపంతో మృతి చెందుతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గర్భిణుల ఆరోగ్యానికి సంబంధించి తొలి నుంచి పూర్తి సమాచారం ఒకే చోట అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులు అందజేసింది. గతంలో ఉండే వివరాలతో పాటు అదనపు సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్ల వయసు వచ్చే వరకూ ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. తల్లికి, బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేకంగా ఐడి నంబర్లు ఇస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య సేవలు పొందడంతో పాటు వైద్య పరీక్షలు, మూత్ర పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన సమయాలను ఈ కార్డులో పొందుపరిచారు. తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించడమే ఈ కార్డు లక్ష్యం. కార్డులో ఇచ్చిన సమాచారం ఆధారంగా వైద్య సేవలు పొందడం ద్వారా గర్భిణులతో పాటు బిడ్డ పూర్తి ఆరోగ్యం ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సంరక్షణ యోజన, జననీ సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం అందించే తదితర పథకాల వివరాలను కార్డులో పొందుపరిచారు. ఎంసీసీ కార్డులో వైద్య ఆరోగ్య సిబ్బంది అందించాల్సిన సేవల వివరాలు, వివిధ రకాల వ్యాధుల లక్షణాలు వివరించారు. నవజాత శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకు సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. చిన్నారులకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉండడంతో వాటిని అధిగమించడానికి నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేలా ఈ కార్డులో వివరించారు.

అన్ని సేవలకు ఒకే కార్డు

తొలి కాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యల వివరాలు, బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించే అంశాలను దీనిలో ముద్రించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలు, పిల్లల శారీరక–మానసిక ఎదుగుదలకు సంబంధించిన అంశాలు, ఐరన్, ఫోలిక్ ఆమ్లం ప్రాధాన్యాన్ని కార్డులో పొందుపరిచారు. బిడ్డ పుట్టిన సమయం కార్డులో నమోదు చేస్తే వెంటనే జనన ధ్రువీకరణ పత్రం వైద్యశాలలో అందిస్తారు.

పెద్దాపురంలో పరిస్థితి ఇదీ..

పెద్దాపురం అర్బన్, రూరల్ గ్రామాల్లో 198 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అయితే 1,387 మంది బాలింతలు, 1,55 మంది గర్భిణులు ఉన్నారని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. వీరందరికీ పెద్దాపురం ఏరియా ఆసుపత్రి, పులిమేరు, కాండ్రకోట (పీహెచ్‌సీ)ల సిబ్బంది వైద్యం, వైద్య సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

ఎక్కడైనా వైద్య సేవలు



గర్భిణులు తొలిసారి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్ష చేయించుకున్న సమయంలో ఎంసీపీ కార్డులో వివరాలను నమోదు చేసి అందజేస్తారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు పరీక్షలు చేయించుకుంటే గర్భిణుల్లో రక్తహీనత ఉందా... హైరిస్క్ సమస్యలు ఏమైనా ఉన్నాయా... అనే వివరాలు కార్డులో నమోదు చేస్తారు. ఆ కార్డు ఉంటే ఏ ఆసుపత్రులలోనైనా సులువుగా కాన్పు చేయించుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ జగదంబ, గైనకాలజిస్ట్, ఏరియా ఆసుపత్రి, పెద్దాపురం

మట్టి నమూనాలపై అవగాహన



విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలోని చల్లా వెంకట్రావు పద్మరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు (స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం) మట్టి నమూనాల అవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం హైస్కూల్ విద్యార్థులకు ఆత్మ పీడీ జ్యోతిర్మయి, పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకురాలు మాధవి ఆధ్వర్యంలో మట్టి నమూనా తీసే వీధానం, విశ్లేషణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి భూసారాన్ని పరీక్షించడం వల్ల వ్యవసాయ అధికారులు భూమిలో లోపాలను సరిదిద్దేందుకు నేల సారం పెంచేందుకు అవసరమైన సూచనలిస్తారు. భూసారాన్ని అనుసరించే పంట దిగుబడులు ఆధారపడి ఉంటాయి. నత్రజని, భాస్వరం, పొటాష్, ఖనిజ లవణాలు ఇతర పోషకాల విలువలు నేలలో ఎంత మేరకు ఉన్నాయో పరీక్షల ద్వారా తెలుస్తుందని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, పెద్దాపురం వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, సుధామాధురి, మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.